www.XtremePapers.com

UNIVERSITY OF CAMBRIDGE INTERNATIONAL EXAMINATIONS
General Certificate of Education Advanced Level

**TELUGU** **9690/02**

Paper 2 Reading and Writing **October/November 2013**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

*6901842307*

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, highlighters, glue or correction fluid.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి.**

మీకిచ్చిన సమాధాన పత్రంలోని ముఖపత్రం మీది సూచనలను పాటించండి.
నిర్దేశించిన స్థలాలలో మీ సమాధాన పత్రం/పత్రసంపుటి మీద మీ పేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.
ముదురు నీలం లేదా నలుపు రంగు సిరా కలాలనే వాడండి.
స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, హైలైటర్లు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**అన్ని** ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
అందించిన సమాధాన పత్రంలో మీ సమాధానాలను **తెలుగులో** రాయండి.
పదకోశాలకు అనుమతి లేదు.
ప్రశ్నల్లో సూచించబడ్డ పదపరిమితిని పాటించండి.
పరీక్ష కాగానే సమాధాన పత్రాలను అన్నిటినీ ఒకటిగా గుదికూర్చి కట్టండి.
ప్రతి ప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర [ ] కుండలీకరణం గుర్తుల్లో గుణాలు సూచించబడ్డాయి.

This document consists of **5** printed pages and **3** blank pages.

DC (KN/TL) 65452/1
© UCLES 2013
UNIVERSITY of CAMBRIDGE International Examinations

## విభాగం 1

ముందుగా ఈ మొదటి పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### తోలుబొమ్మలాట

బాలరాజు, నారాయణ మంచి స్నేహితులు. చిన్నప్పటి నించీ వాళ్ళిద్దరూ కలిసి చదువుకున్నారు. ఇప్పుడు వాళ్ళు కాలేజిలో బిఏ చదువుతున్నారు. నిన్ననే బాలరాజుకు సిరిపురం నించి గోవిందు ఫోన్ చేశాడు. గోవిందు బాలరాజు వయస్సు వాడే. ఒక సంవత్సరం పెద్ద. బాలరాజుకు అన్న వరస అవుతాడు. గోవిందు తండ్రి బాలరాజుకు పెదనాన్న అవుతాడు. పెదనాన్న కొడుకూ, పెద్దవాడూ కనుక గోవిందు బాలరాజుకు అన్న. వాళ్ళ కుటుంబాలు బాగా అన్యోన్యంగా ఉంటాయి. గోవిందు తండ్రి గుంటూరు వచ్చినప్పు డల్లా బాలరాజు వాళ్ళ ఇంట్లోనే దిగుతారు.

ఇప్పుడు గోవిందు ఫోన్‌లో చెప్పిన విషయం ఏమిటంటే: వాళ్ళ ఊళ్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలు జరుగుతున్నాయట. ఈ ప్రదర్శనలు ఒక వారం రోజుల పాటు జరుగుతాయట. మంచి అవకాశం; వారం రోజులూ ఉండలేకపోయినా కనీసం శని-ఆది వారాల్లో వస్తే బాగుంటుంది అని కూడా చెప్పాడు. బాలరాజుకూ నారాయణకూ వారం రోజులూ వెళ్ళి తోలుబొమ్మలాట ప్రదర్శనలు చూడా లనిపించింది కాని కాలేజీ ఉంది కనుక క్లాసులు పోతాయి; పైగా పరీక్షలు కూడా దగ్గర పడుతున్నాయి. అందుకని వాళ్ళు ఈ వారాంతంలో అక్కడికి వెళ్ళాలి అని నిశ్చయించుకున్నారు.

వాళ్ళు తోలుబొమ్మలాటను ఎప్పుడూ చూడలేదు. ఇటీవలి కాలంలో ఈ ప్రదర్శనలు జరగటం లేదు. తోలుబొమ్మలాట ప్రదర్శించేవాళ్ళు బృందాలుగా సంచారం చేస్తూ ఉంటారు. ఒక్కొక్క ఊళ్ళో కొన్ని రోజులు మకాం చేస్తారు. వాళ్ళ ప్రదర్శనలు రాత్రి పొద్దు పోయిన తర్వాత మొదలై తెల్లవారుజాము దాకా జరుగుతాయి. పగలంతా విశ్రాంతి తీసుకుని రాత్రిళ్ళు ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. గ్రామాలలోని ప్రజలకు ఈ ప్రదర్శనలు మంచి వినోదం కలిగిస్తాయి. అంతే కాదు అవి పౌరాణిక చారిత్రక గాథల పరిజ్ఞానాన్ని కూడా అందిస్తూ ఉంటాయి.

బాలరాజూ నారాయణా ఆదివారం సాయంత్రం ఆరు గంటలు అవుతూ ఉండగా సిరిపురం చేరుకున్నారు. ప్రదర్శన రాత్రి తొమ్మిది గంటలకు మొదలౌతుంది. ఇద్దరూ బాలరాజు పెదనాన్న గారి ఇంట్లో భోజనాలు చేశారు. ఎనిమిదిన్నర కల్లా గోవిందుతో కలిసి ఊరి నడిబొడ్డున ఉన్న ప్రదర్శన స్థలానికి చేరుకున్నారు. అది ఆరుబయలు. ప్రదర్శన ఇచ్చే చోట సినిమా తెర లాగా ఒక తెల్లని బట్ట కట్టి ఉంది. దాని ముందు ప్రేక్షకులు కూర్చునేందుకు వీలుగా పెద్ద కాళీ స్థలం ఉండేలా చేశారు. ఆ కాళీ స్థలంలో ప్రేక్షకులు నేల మీదనే కూర్చోవాలి. గ్రామస్థు లంతా ఎవరి ఇంటి నించి వారు చాపలు తెచ్చుకొని కూర్చున్నారు. ఒక పక్కగా గ్రామ పెద్దలకూ, అతిథులకూ కొన్ని కుర్చీలు వేశారు. బాలరాజూ నారాయణా గోవిందూ నేల మీదనే చాప వేసుకొని కూర్చున్నారు.

బాలరాజు పెదనాన్న గారు సిరిపురం గ్రామ పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు. ఆ హోదాలో పంచాయతీ బోర్డు తరఫున ఆయన ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయించారు. ఆయన ఆనాటి ప్రదర్శన గురించి కొంచెం వివరించి, కళాకారులను పరిచయం చేశారు. తర్వాత ప్రదర్శకులు తెర వెనుక ఒక పెద్ద కరెంటు దీపాన్ని వెలిగించి ప్రదర్శన మొదలు పెట్టారు. రకరకాల రంగులు వేసిన తోలుబొమ్మలను ఆడిస్తూ ప్రదర్శకులు ఆయా పాత్రలకు తగిన మాటలు మాట్లాడుతూ, పాటలు పాడుతూ అందరినీ అలరించారు. ముఖ్యంగా కేతిగాడు, బంగారక్క అనే హాస్య పాత్రలు అందరినీ కడుపుబ్బ నవ్వించాయి.

**1** దిగువ పేర్కొన్న అర్థ వివరణలకు బాగా సరిపోయే పదాలు/పదబంధాలు పై పాఠ్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి: మిత్రులు
సమాధానం: స్నేహితులు

(అ) పరస్పరం ఆత్మీయంగా [1]
(ఆ) సమీపిస్తున్నాయి [1]
(ఇ) గుంపులుగా [1]
(ఈ) బహిరంగ స్థలం [1]
(ఉ) ఆనందింప జేశారు [1]

[మొత్తం గుణాలు 5]

**2** కింద సూచించిన పదాలను/పదబంధాలను వాటి అర్థం వ్యక్తం అయ్యేలా మీ సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

మాదిరి: వరస
సమాధానం: సోముకు రాజమ్మ పిన్ని వరస అవుతుంది.

(అ) అవకాశం [1]
(ఆ) నిశ్చయించుకోటం [1]
(ఇ) ఏర్పాటు [1]

బ్రాకెట్లలో సూచించిన పదాలను/పదబంధాలను ఉపయోగించి వాక్యాలను తిరగరాయండి.
మాదిరి: బాలరాజుకు తోలుబొమ్మలాట చూడాలని ఉంది. [కోరిక]
సమాధానం: బాలరాజుకు తోలుబొమ్మలాట చూడాలనే కోరిక ఉంది.

(ఈ) కాలేజీ ఉంది కనుక కుదరదు. [లేకపోతే] [1]
(ఉ) తెర వెనుక ఒక కరెంటు దీపాన్ని వెలిగించి ప్రదర్శన మొదలుపెట్టారు. [మొదలుపెట్టే ముందు] [1]

[మొత్తం గుణాలు 5]

**3** మీది పాఠ్యంలోని వాక్యాలనే ముక్కికి ముక్కి దించకుండా కింది ప్రశ్నలకు మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.
(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించబడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) గోవిందు బాలరాజుకు ఎట్లా అన్న వరస అవుతాడు? [2]
(ఆ) **(i)** గోవిందు బాలరాజును ఎందుకు సిరిపురం రమ్మన్నాడు? [1]
**(ii)** బాలరాజు, నారాయణ వారం రోజులు ఉండేలా ఎందుకు వెళ్ళలేకపోయారు? [2]
(ఇ) మూడవ పేరా ప్రకారం తోలుబొమ్మలాట గురించిన విశేషాలు తెలపండి. [4]
(ఈ) నాల్గవ పేరా ప్రకారం తోలుబొమ్మలాట ప్రదర్శనకు చేసిన ఏర్పాట్ల గురించి మూడు అంశాలు తెలపండి. [3]
(ఉ) ప్రదర్శన ఏ విధంగా జరిగింది? [3]

[మొత్తం గుణాలు 20]

## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువ నున్న రెండో పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### గోపయ్య కుటుంబం

గోపయ్య కుటుంబంలో అందరూ తోలుబొమ్మలాట కళాకారులే. నిమ్మలకుంట గ్రామంలో పుట్టిన ఈ తెలుగువారి కళకు ఇప్పుడు ఆదరణ తగ్గిపోయింది. పూర్వం కష్ట జీవులకు వినోదం ఇచ్చేవి రంగస్థల ప్రదర్శనలే. ఇప్పుడు సినిమాలు వచ్చాయి; టెలివిజన్ వచ్చింది. వాటి ద్వారా జనానికి చౌకగానూ సులభంగానూ వినోదం అందుతున్నది. అందువల్ల గోపయ్య వంటి కళాకారుల కుటుంబాలకు ప్రదర్శన అవకాశాలు తగ్గిపోయాయి.

మేక తోలును గాని, గొర్రె తోలును గాని బొమ్మలుగా కత్తిరించి రంగులు వేసి తయారు చేసినవే తోలుబొమ్మలు. గోపయ్య కుటుంబంవారు తయారు చేసే తోలుబొమ్మలు విశేషమైనవి. ఎందుకంటే తోలు శుద్ధి చేయటంలో వాళ్ళది ఒక ప్రత్యేకమైన పద్ధతి. తోలును బొమ్మలకు కావలసిన తల, మొండెం, చేతులూ, కాళ్ళూ మొదలైన ఆకారాలుగా కత్తిరించుకోటంలో కూడా ఎంతో జాగ్రత్త తీసుకుంటారు. వాటిని ఆడించటానికి వీలుగా తాళ్ళతో కలిపి కడ్తారు. ఆయా అవయవాలకు దారాలు కట్టి వాటితో తెర వెనక నుండి బొమ్మలనూ, వాటి అవయవాలనూ కదిలిస్తూ ఆడిస్తారు.

ప్రదర్శనలో కూడా గోపయ్య కుటుంబానికి ప్రత్యేకత ఉంది. ఒక తెల్ల బట్టను తెర లాగా కట్టి, దాని వెనుక ఒక పెద్ద లైటు పెట్టి, ఈ బొమ్మలను ఆడిస్తూ వాటి నీడలను తెరమీద పడేలా చేస్తారు. ఇది అందరూ చేసేదే. కాని లైటును దగ్గరగానూ దూరంగానూ జరపటం వల్ల వెలుగు-నీడలను సృష్టిస్తూ దీపపు రంగును అవసరానికి తగినట్లుగా మారుస్తూ కథా సందర్భానికి తగిన భావస్ఫూర్తిని కలిగిస్తారు. ఆంగికంలో కూడా – అంటే బొమ్మల అవయవాల కదలికలలో కూడా ఆయా పాత్రల హావభావాలను ఒలికించేలా ఆడిస్తారు. వాచికంలో కూడా – అంటే మాటలు పలకటంలోనూ, పాటలు పాడటం లోనూ భావస్ఫూర్తిని కలిగిస్తారు.

గోపయ్యది ఉమ్మడి కుటుంబం. ఆ కుటుంబంవా రందరూ కలిసి ఈ ప్రదర్శనలను నిర్వహిస్తారు. కావలసిన బొమ్మలను వారే తయారుచేసుకుంటారు. వారందరూ గాయకులు మాత్రమే కాదు పాత్రోచితమైన హావభావాలతో సంభాషణలను చెప్పగలవారు కూడా! ప్రదర్శనకు కావలసిన విద్యలను ఆ కుటుంబంవారు ఎప్పుడూ సాధన చేస్తూ ఉంటారు. ప్రదర్శనలో తెర వెనుక నుండి బొమ్మలను ఆడిస్తూ సంభాషణలు చెప్పటం, పాటలూ పద్యాలూ పాడటం మొదలైన అన్ని పనులనూ చేసే విధంగా కుటుంబంలోని సభ్యు లందరూ ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు.

గోపయ్య కుటుంబం మహాభారత కథలను ప్రదర్శించటంలో దిట్ట. గోపయ్య స్వయంగా జానపద కవి. అతను భారతంలోని ఎన్నో కథలను పాటలుగా రచించాడు. ఆ పాటలనే అతని కుటుంబం ప్రదర్శించే తోలుబొమ్మలాటలలో పాడతారు. భారత కథలలో ధర్మరాజు, కృష్ణుడు పాత్రలకు అతనే సంభాషణలు చెప్తాడు. అతను ఆ రెండు పాత్రలకూ తగినట్లుగా గొంతు మార్చి మాట్లాడ్తాడు. ఆ రెండు పాత్రలను ఒకే సారి తెర మీద ఆడించే టప్పుడు అతను గొంతు మార్చి మాట్లాడుతుంటే నిజంగా వేరువేరు మనుషులే మాట్లాడుతున్న ట్లుంటుంది. అతనే కాదు అతని కుటుంబంలో ఆయా పాత్రలకు తగిన విధంగా గొంతులు మార్చి మాట్లాడే వారు చాలా మంది ఉన్నారు. అందువల్లనే అసంఖ్యాక మైన పాత్రలతో కూడిన కథలను వారు ప్రదర్శించ గలుగుతున్నారు. అతని పెద్ద తమ్ముడు ప్రదర్శనలలో ఉపయోగపడే మంచి హాస్య సన్నివేశాలను కల్పన చేసి, వాటికి తగిన సంభాషణలు రూపొందించి అతని భార్యతో కలిసి వాటిని చక్కగా నిర్వహిస్తాడు. తోలు బొమ్మలాటలవారు సృష్టించి ప్రసిద్ధికి తెచ్చిన 'కేతిగాడు', 'బంగారక్క' అనే హాస్య పాత్రలను వారిద్దరూ పోషిస్తారు.

**4** పై పాఠ్యం లోని వాక్యాలనే ముక్కికి ముక్కి దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగు**లో మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించ బడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) గోపయ్య కుటుంబం వంటి కుటుంబాలకు ప్రదర్శన అవకాశాలు ఎందుకు తగ్గిపోయాయి? [2]

(ఆ) గోపయ్య కుటుంబం తయారుచేసే తోలుబొమ్మలు ఏ విధంగా విశేషమైనవి? [3]

(ఇ) తోలుబొమ్మలాటను ప్రదర్శించటంలో గోపయ్య కుటుంబం ప్రత్యేకత ఏమిటి? [3]

(ఈ) గోపయ్య కుటుంబ సభ్యులు వేటిని సాధన చేస్తూ ఉంటారు? దేనికి సిద్ధంగా ఉంటారు? [2]

(ఉ) తోలుబొమ్మలాటలో గోపయ్య ప్రత్యేకతలను తెలపండి. [3]

(ఊ) గోపయ్య పెద్ద తమ్ముడి ప్రత్యేకతలు ఏమిటి? [2]

[ మొత్తం గుణాలు 20]

**5** ఈ కింది ప్రశ్నలకు మీ సమాధానం మొత్తం 140 పదాలకు మించకుండా **తెలుగు**లో రాయండి.

(అ) ఇప్పుడు మీరు చదివిన రెండు పాఠ్యాలలోని తోలుబొమ్మలాట ప్రదర్శనను గురించిన అంశాలను క్రోడీకరించి రాయండి. [10]

(ఆ) సంప్రదాయ రంగస్థల నాటకంతో పోల్చి చూసినప్పుడు తోలుబొమ్మలాట ప్రత్యేకతను గురించి మీ అభిప్రాయం తెలపండి. [5]

[భాషా పాటవానికి 5]

[ మొత్తం గుణాలు 20]

**BLANK PAGE**

© UCLES 2013 

**BLANK PAGE**

© UCLES 2013

**BLANK PAGE**

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

University of Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.

© UCLES 2013 